# చిత్రాంగి

### సత్యమూర్తి

మానవప్రకృతి ఎప్పుడూ స్వతంత్రాన్ని కోరుతూంటుంది. ఈ స్వతంత్రాన్ని సామాజిక శక్తి సాధ్యమైనంతవరకు అణచ డానికి ప్రయత్నిస్తూవుంటుంది. లేకుంటే ద్రౌపది కర్ణుడుకోసరం లొట్టలు వేసుకొంటూ ఆహ్వా నించి వుండేది. కాని యీ తీరని కోర్కెలు అందుబాటుకు వచ్చేసమయంకూడా వుంది. అదే స్వప్నరూపంగా మనం అనుభవిస్తూ వుంటా మని "సైకాలజిస్టు" చెబుతూంటారు

మాలతి నవయవ్వనవతి యౌవ్వనవతులకు సహజంగావుండే తీరని కోర్కెలెన్నో మాలతికీ వున్నాయి. స్వప్నంలో ఆ కోర్కెలన్నీ అను భవిస్తూ వుండేది. ఆ రూపవంతునితో మాట్లా డడం, అతని స్వహస్తంతో బొట్టు దిద్దించు కోవడం, పచార్లు చెయ్యడం, ఆ పక్షులు మృగా లు పొందుతూన్న స్వాతంత్రం తానుకూడా అను భవించడం . యింకా ఇంకా ఎన్నో స్వప్నం లో అనుభవిస్తూండేది. తెల్లవారేటప్పటికి తను రాత్రి అనుభవించిన స్వేచ్ఛంతా కల. ఒక నిట్టూర్పువిడచి పెద్దలు దిద్దిన సమాజిక ధర్మ మార్గంలో అడుగు తప్పకుండా నడచిపోయేది. దేవుడనేవాడు వున్నా లేకపోయినా మనకు ప్రత్య క్షంగా కనపిస్తూ మన యోగక్షేమాలను చూస్తూ వున్నవాడు సూర్య దొకడున్నాడు. వాడి ఎదు రుగా నిలబడి తన అవస్థ చెప్పుకుందామని ఒక నాడు మాలతి ప్రయత్నించింది. ఉదయంలేచి కాలకృత్యాలు తీర్చుకొని స్నానంకూడా చేసి దొడ్లో సూర్యుడు కనబడేచోటుకెళ్ళి నిలబడింది. కాని ఎందుకో ఒక్కక్షణంకూడా అక్కడుండ లేక గిర్రున వెనక్కు యింట్లోకి వచ్చేసింది. ఎండ తీక్షణ భరించలేకా ? కాదు — ఒకవేళ సూర్యుడు తన్ని కుంతీదేవి అనుకొని కవచకుండ లాలతో కర్ణుణ్ణి ప్రసాదిస్తాడేమోనని భయం అను కుంటాను మాలతికి — లేకుంటే ఎంత ప్రయ త్నంజేసి వెంటనే వెనక్కుతిరిగి ఎందుకొస్తుంది. మాలతికి సూర్యుడుమీద ఆశకూడా తీరిపోయింది. ఇక ఆ రోజునుంచే కాలేజీకి వెళ్లేముందూ, వచ్చిన తర్వాత ఒంటరిగా తనగదిలో కూర్చుం డేది. ఆ గదిలోకి తన తండ్రిగాని, వంటవాడు గాని రావాలి. ఇంకెవ్వరు ఆ యింట్లో లేరు. తన తండ్రి ఆదాయానికంతకూ తనే వారసు రాలు. మరోమాటలో చెప్పాలంటే మళయాళ స్త్రీ. తన్ను చేబట్టి తన ఆస్తి ఒకడు తినాలిగాని తను మరోవ్యక్తి ఆదాయంపై ఆధారపడ నవ సరంలేదు. దాంతో కాస్త మగవాలకం మగ గుణాలు అబ్బినై మాలతికి. తనగదిలో కూర్చుని స్వప్నసుందరునికి వుత్తరాలు వ్రాస్తూ వుంటుంది. తన మనోభావాలు, వేదన అన్నీ ఆ వుత్తరాల్లో వ్యక్తపరచుకొని కాస్త హృదయంలో శాంతి నెలకొల్పుకొనేది. మరొకప్పుడు అతడే తనకు "ప్రేయసీ" అని సంబోధిస్తూ వుత్తరం వ్రాసి నట్లు వ్రాసుకొని హృదయాని కద్దుకొని ఆనం దించేది. ఈ ప్రేమ వుత్తరాలన్నీ ఏరోజు కా రోజు చిన్నచిన్న ముక్కలుగా చించి ఘునిపి

పాలిటీ చెత్తకుండలో వేస్తూవుండేది తనులోపల కూర్చొని వుత్తరాలు వ్రాస్తూన్నప్పుడు ఏ వంట వాడో లోపలకు వచ్చి భోజనానికి రమ్మని పిలిచాడంటే వాడికి చదువురాదని తెలుసుకున్నా ఎందుకో కంగారుపడిపోయి వుత్తరం వ్రాస్తూన్న కాగితం మడిచి పుస్తకంలో యిరికించి భోజనానికి బయలుదేరేది.

ఈ సంవత్సరం సీనియర్ క్లాసులోకి ఒక కొత్తఅబ్బాయి వచ్చేడు అతడొక్కడే కొత్తవాడు కాకపోయినా, మాలతిని ఆకర్షించగలగడమే అతనిలో నూతనత్వం. మాలతి స్వప్నసుందరికీ యీ అబ్బాయికీ భేదంలేదనుకుంటాను. లేకుంటే మాలతి అతనిపంక అంత ప్రత్యేకంగా ఆశగా నాలిక చప్పరించుకుంటూ ఎందుకు చూస్తుంది. ఈ మధ్య అతనికి వందరూపాయలు మనియార్డరుకూడావచ్చిందనిగ్రహించింది దాంతో అతనిమీద అనురాగం ఎక్కువైంది. డబ్బుతో నిమిత్తమేముంది తనకు మనిషి నచ్చాలిగాని; అయినా అడమనిషి కాదండీ తనకెంత డబ్బున్నా ..ఆ ఆశపోదు మొన్న యింగ్లీషు లెక్చరరుగారు ప్రశ్న అడిగితే సమాధానం విని క్లాసంతా నవ్వారు-ఎంత బాగా సమాధానం చెప్పకపోతే క్లాసంతా ఒక్కుమ్మడిగా నవ్వుతుంది; ఇంకేం కావాలి రూపవంతుడు, ధనవంతుడు, తెలివైనవాడు. ఐనా స్త్రీ ముందెలా పలుకరిస్తుంది. "ఫర్"గా నటిస్తుంది. అది తెలుసుకొని మగాడు "ఓ!" అనిపించాలి.

ప్రతిసాయంకాలం కాలేజీనుంచి యింటికి




వెళ్ళేప్పుడు మాలతి వెనక్కాల అబ్బాయి బయలు దేరుతాడు. ఆ సందులోకి మళ్ళినతర్వాత రెండు మూడు చిటికెలు వేస్తాడు ధైర్యం తెచ్చుకొని మాలతి వెనక్కి చూస్తుంది, అంతే బుఱ్ఱపైకెత్తకుండా గబగబా ముందుకు నడచిపోతాడు. ఏంజేస్తుంది పాపం మాలతి చిన్నగా తనలో నవ్వుకొని పుస్తకాలు గట్టిగా అదిమిపట్టి యింటివైపు నడచిపోతుంది ఇలాంటి సంఘటన ప్రతి రోజూ జరుగుతూనే వుంటుంది. మాలతికి అతని ప్రకృతి అర్థంకావడం లేదు. మొదట్లో ప్రణయం యిలాగే నడవాలి కాబోలని మాలతి తొట్రుబాటు లేకుండా నడచుకొంటూంది. ఎన్నాళ్ళని, రోజులు, వారాలు, నెలలూ గడచిపోతున్నాయి. మొదటి రోజుకి యీ వాళకు అతనిలో మార్పేమీ రాలేదు. ఇది తలచుకుంటే మాలతికి ఒక్కొక్కప్పుడు విరాళలా కనుపిస్తుంది. ఒకనాడు సాయంకాలం సందుమలుపులో మామూలుగా చిటికెలు వేశాడు. మాలతి ఆశగా అతనివైపు చూసింది. అతడు మాత్రం చలించకుండా ముందుకు నడచిపోతున్నాడు. ఆ ముందు కోడిపుంజు పెట్టను తరుముతూంది కొంటెపిల్లకాయలు గోల చేస్తూ పరుగులెడుతున్నారు, ఓ బాలకవి చేతులు కట్టుకొని ఆ దృశ్యాన్ని చూస్తూ చిన్నగా నవ్వుతూ శృంగారం అనుభవిస్తూన్నాడు. ఆ దృశ్యం చూచి మాలతిదగ్గర పెద్దవాళ్ళెవరూ లేరని పరిశీలించుకొని ఫక్కున నవ్వింది. అప్పుడైనా ఆ అబ్బాయి వెనుదిరిగి చూచి నవ్వడే-తనకు నవ్వుమాట జ్ఞాపకం లేకపోతే అందించినప్పుడు కూడా నవ్వకపోతే అతని ప్రకృతి-నడత-స్వభావం. ఉద్దేశ్యం-ఏమిటన్నమాట?

ఆ వాళసాయంకాలం యింటికెళ్ళిన తర్వాత మాలతి ఒంటరిగా తనగదిలో కూర్చుని ఆలోచిస్తూంది. ఆ ఆలోచనకు గమ్యస్థానంలేదు. రాత్రి 8 గంటలైన తరువాత వంటవాడు భోజనానికి పిలిచాడు, "ఊఁహూ!" అని క్లుప్తంగా సమాధానం చెప్పి తలుపు జేరవేసి "యీజీచైర్"లో జేర్లబడింది. వాడు మాట్లాడకుండా వెళ్ళి యజమానితో చెప్పేడు. తండ్రివచ్చి మాలతిని కారణం అడిగితే "వంట్లో బాగుండలేదు-అమ్మా!" అని కళ్ళుమూసుకొని ప్రక్కకు తిరిగి పడుకొంది. ఆయనకేమీ పాలుపోక ప్రక్కింట్లో శాస్త్రిగార్ని-కాస్త తెలుగువైద్యం చేస్తాడాయన. చెయ్యిచూడమని పిలచాడు. శాస్త్రిగారు వచ్చి మాలతి చెయ్యిపట్టుకోబోయారు" వద్దండీ! కాలేజీనుంచి వచ్చేప్పుడు జనరల్ ఆస్పటల్లో మందుపుచ్చుకుని వచ్చేను. ఫరవాలేదులెండి-ప్రొద్దుటకు కులాసాగా వుంటుంది" అని సమాధానం చెప్పుకొని నిద్ర నటించింది "ఇప్పటి వాళ్ళకు మన తెలుగువైద్యాలు నచ్చవండీ" అన్నాడు మాలతి తండ్రి. "దానికేంలెండి ఏదో మందు వేసుకున్నానంటుందిగా రేపుజూచి ఆలోచిద్దాం" అన్నాడు శాస్త్రి.

ఆవాల్టికి చదువుకు స్వస్తిచెప్పి పడుకొంది. మనస్సులో శాంతుంటేగా చదవడానికి? ఆలోచన గమ్యస్థానం చేరకముందు శాంతిరాదు. శాంతి లేకుంటే ఏ పనీ జరగనూ జరగదు.

"ఆ అబ్బాయి కాలేజీకి వచ్చిన్నాడే అనుకుంది తనిక "చలం"గారి శిష్యురాలై వీధిగుమ్మంలో నిలబడి తొంగితొంగి దొంగచూపులు చూడ నక్కరలేరని అంతపని తను చెయ్యలేదేమో? ఏదీ ఆ అబ్బాయిని ఆకర్షించగల్గి వివాహమాడ గల్గితే అలా అనుకోవచ్చు ఏదీలేదు. అప్పుడే "చలం"గార్ని పోటీచేస్తావని గాలిమేడలు కట్టుకోడం దేనికి? ప్రతిరోజూ వెనకాల చిటికలు వేస్తాడు. తన్ని అనుభవిద్దామనైనా (పెండ్లిచేసుకోబోయినా) లేకపోతే అతను అలా చిటికలు వెయ్యడం దేనికి? నిజంగా ఆ వుద్దేశమేవుంటే నేను వెనక్కు చూచినప్పుడు మాట్లాడకపోతే

పోయె నవ్వుముఖమైనా పెట్టదే? అసలు అతనికి ప్రణయగాథ నడపడం చేతకాకపోతే తగుదునమ్మా అని నాయకత్వం వహిస్తున్నట్లు ఆ చిటికలేమిటి? ఇలాంటి ప్రకృతున్న యువకులు కథల్లోనైనా ఎక్కడా కనబడరే? ఆయన స్వభావాన్ని అర్థంజేసుకొని ఆకర్షించే శక్తిలేదేమోనాకు? అంత ఆత్మదూషణ దేనికి? చిటికలు వినబడే ఉప్పటికి ఎందర్నున్నా వెనక్కు తిరిగి చూస్తాను. అంతకంటే బహిరంగంగా ఉద్దేశ్య తెలియజేయాలంటే మాట్లాడడం తప్ప మరో మార్గంలేదు. నడివీధిలో బుట్టవాలేసుకొని వెడుతూన్న పెద్దమనిషి సిగ్గు అభిమానం విడచి పలకరించడం ఎలా? నేనెంత అతనిముందు తక్కువదాన్నైనా అంత సాహసిస్తే లోకులేమనుకుంటారు? నేనే మొగాణ్ణయితే అలాగే చేస్తానా? ఇంత అనురాగం చూపించే యువతి యింటిచుట్టూ రాత్రింబవలు పచార్లు కొట్టేద్దును. నిజంగా ఆ వాళ ఆ కోడిపుంజు తరుముతూంటే ఆ వీధిన వెడుతూ మూతి బిగించుకొని నడిచివెళ్ళడంటే అతడు మగాడేనా? నాకు నేనే ఎంతగట్టిగా నవ్వేను. అప్పుడైనా ఒక్కమారు మొహం అసహ్యంగానైనా వెనక్కు తిప్పితే తప్పునా అతని ఉద్దేశం?" నేను యీ వూరు చదువుకోడానికే వచ్చేను. ఇక ఇతరవిషయాలతో నాకు నిమిత్తం లేదు. నేను జితేంద్రియుణ్ణి ఆట్పే పీ చెరుకుబాణం నా దగ్గర ప్రయోగిస్తే ప్రయోజనంలేదు సుమా" అన్నట్లుకనబడతాడు! పోనీ యిప్పుడు తనకా ఉద్దేశ్యం లేకపోతే యిప్పుడు కాదు చదువు పూర్తికానియ్ అని ముఖాముఖీని చెప్పి చిటికలు కట్టిపెట్టి నా హృదయంలో శాంతి నెలకొల్పకూడదూ? ఏమిటా చిటికలు? ఇదేం కాదు నన్నేడిపించడానికి యిదో ఎత్తు. ఇది ప్రణయగాథైతేగా ఫలితందగ్గర బద్ధం. తనకేదో క్షణికానందంకోసరం నన్ను పరికరంగా వుపయోగించుకోడానికి చిటికలు వేస్తూండడం. అందులో నాకూ పాలుందని నేను భ్రమించడమేగాని ఏమీలేదు. ఈ వ్యక్తిమీద సరియైన చర్యదీసుకొని కనీసం యీ కాలేజీనుండైనా బయటకు పంపించి నా మనస్సును కుదుటబరచికోడంతప్ప వేరే మార్గంలేదని' నిర్ణయించుకొనిపడుకొంది. ఈ నిర్ణయానికి వచ్చేప్పటికి రాత్రి రెండు గంటలైంది. అప్పుడుగాని నిద్రపట్టలేదు మాలతికి.

తెల్లవారింతరువాత మాలతి తండ్రి అమ్మాయిని చూడ్డానికని గదిలో ప్రవేశించాడు. తలమీద వంటిమీద చేయివేసిచూసి జ్వరం తగ్గినట్లు గమనించి.

"అమ్మా జ్వరం తగ్గినట్టుంది కాదూ?"

"ఆఁ! తగ్గిందినాన్నా! సుఖంగానేవుంది"

"ఈవాళ కాలేజీవుందికాబోలు లేచి.... ."



"ఆఁ! ఇంకెందుకు కాలేజీకి వెళ్ళను. వెధవ కాలేజీ చదువు. మానాభిమానాలు లెక్కలేకుండా వెధవలు; బుద్ధుండక్కర్లేదు. మాలాంటి అక్కచెల్లెళ్లు ఆ కుఱ్ఱ వెధవలకు మాత్రం లేరా?"

"ఎవరమ్మా! ఎవరు? ఆ వెధవెవరో చెప్పు ఏంజేసాడు?"

"ఆ దుర్తివారింటో అద్దెకుంటున్నాడు కాదూ, ఎఱ్ఱగా పొడుగ్గా వుంటాడు. మొహంమీద పోత్రం పొటిమలుకూడా వుంటాయి కాలేజీనుంచి వచ్చేప్పుడు వెనకాాలే చిట్టికలు వేస్తాడు. [ఏడుస్తూ] కాస్త వయసొచ్చిన వాళ్ళను జూస్తే వాళ్ళ కెలావుంటుందో - వాళ్ళవైపు ఎప్పుడైనా కన్నెత్తి చూస్తామా వెదవలు? ఇప్పుడమ్మేవుంటే ఎంత నొచ్చుకున్ను. ఆ వెధవకు ఎన్ని శావనా శారాలపెట్టి ఎన్ని... ......"

"ఊరుకో నీ కెందుకు? లేచి మొహం కడుక్కొని కాస్త కాఫీ తాగు ఆ వెధవను గురించి ఏం చెయ్యాలో శాస్త్రిగారితో ఆలోచిస్తాను ఈ మాత్రం భాగ్యానికి నువ్వు భోజనం మానేసి ఇలా కుమిలి పోవడం దేనికి?"

అని హెచ్చరించి మాలతి తండ్రి శాస్త్రిగారి కోసమని కంగారుగా గట్టిగా పిలిచాడు వీధి గుమ్మంల్లోంచి.

"శాస్త్రిగారూ!"

"ఆఁ! ఎవరది?"

"నేను! ఇలారండి,"

"ఏమిటది కంగారు పడతారెందుకూ,"

"ఈ కాలేజీ కుర్ర వెధవలండి బారుగా విథా సారించి పోతున్నారు నోళ్ళు కట్టిపెట్టి వీళ్ళకు డబ్బు పంపుతూంటే వీళ్లు నేర్చుకొనేవి విరహ వేదనలూ ప్రణయగాధలూనూ"

"ఇప్పుడు చదువులన్నీ అలాగే వున్నాయి లెండి వర్ణించి చెప్పేవాడు లేడు. చెబితే నేర్చుకొనేవాడూలేడు. ఏదైనా ఒకటి చెబితే అదెందుకు కాకూడదు? అంటూ విమర్శలు వ్యాఖ్యానాలూ మొదలుపెట్టేరు కుఱ్ఱవెధవలు దగ్గరమంచేను. ఇంతకువాళ్ళ గొడవ మనకెందుకొచ్చింది? ఏమిటంటారుమీరు?"

"మన మాలతి."

"ఆఁ! ఏంజేసింది?"

"ఏం జేస్తుంది? పిన్న కాలేజీనుంచి వస్తోంటే ఆదుర్తివారింట్లో అద్దెకుంటూన్న కుర్రాడు వెనక్కాల చిటికలువేసాడట."

"అయ్యోవెధవ - బారుగా యింత ఓహిరంగంగా - ఎంతధైర్యం? ఇలాంటి వెధవల్ని కనికరించమని పనిలేదు. పదిమందిలో బెట్టి యీడ్చి తన్నాల్సిందే. మంచీ, చెడ్డా, ధర్మం, న్యాయ్యం

ఆనందవాణి

పోస్టుబాక్సు నెంబరు

1583

—మేనేజరు

అన్నీ పెద్దలతోటే పోయాయండి. మనమేదో వుండబట్టలేక అనుకోడంగాని కాలం మారిపో తూంది. మంచీ, చెడ్డా యీ రెంటికి భేధమే వుండదు కొన్నాళ్ళకి."

'అలాగే వుంది చూస్తూంటే, మాలతిబడి మానేస్తానంటుంది. ఏదో మానాభి మానాలుగల పిల్లగాబట్టిగాని, ఏకాస్త అదోరకం పిల్లయినా మా కుటుంబ గౌరవం, మర్యాదా మంటగలసి పోవలసిందే గదా! చిటికలు వేస్తున్నాడని చెప్ప డానికెంత సిగ్గుపడిందనుకున్నారు? ఆఖరికి తల్లిని తలుచుకొని ఏడ్చింది."

"కాదుటండీ, వెధవలు."

"మీరునాకూడా రావాలివేళ. అమ్మాయిని తీసు కొని పదిగంటలకు మనమిద్దరం కాలేజీకివెళ్ళి "ప్రిన్సిపాలు" గారితో యీ విషయం చెబుదాం బాబూ! పెద్దన్నయ్యకు "ప్రిన్సిపాలు" గార్కి నేస్తం వుండేదని చెబుతూండేవాడు."

"దీనికి నేస్తమెందుకండి? న్యాయం సంగతి ఆయనకు మాత్రం తెలియదంటారా? ఇలాంటి వెఱ్ఱివేషాలు మనమే చూస్తూ వూరుకుంటే ప్రతీ కుర్ర వెధవకీ గర్వం మరీ బలిసిపోతుందండి. బయలుదేరండి. కాస్త బొట్టుంచుకొని వస్తాను."

ప్రిన్సిపాలు.—ఏం! అమ్మాయీ ఇతడేం చేసా డంటావు?

శాస్త్రి.— ఏంజేశాడని వెమ్మదిగా అంటా రేమిటి?

బంట్రోతు.—ఉస్! మీరాగండి! అమ్మాయిని చెప్పనివ్వండి ప్రిన్సిపాలుగారు అడుగుతున్నా రుగా?

మాలతి:—కాలేజీ విడచిన తర్వాత ఆ ప్రక్క సందులో మళ్ళేటప్పుడు ప్రతిరోజూ వెనకాల చిటికలు వేస్తాడండీ

ప్రిన్సిపాలు:— అతడౌనోకాదో నీ కెలా తెలుసును?

శాస్త్రి —మహబాగుంది బాబూ అడగడం.

బంట్రోతు.— ఆగవయ్యా! ఆగు!! ఏమిటా కంగారు నీకు!!! అయ్యో!

మాలతి.—నేను వెనక్కి తిరిగి చూసేప్పటికి అతడొక్కడే వుంటాడండి.

ప్రిన్సిపాలు —చిటికలువేసి వూరుకుంటాడా? ఇంకేమైనా అల్లరిచేస్తాడా?

శాస్త్రి:—చాలదటండీ మాబోంట్ల మర్యాద పాడుజేయడానికి? ఇంకేంకావాలి!

బంట్రోతు.—నిలబడవయ్యా! ఏమిటా ఒడు దుడుకు? యీ మాత్రం దానికి కాలేజీ కెందుకొచ్చావ్? ఏ జరుగుతుందో నిలబడి చూచి తరువాత నిన్నడిగినప్పుడు చెప్పు! బారుగా పెద్దలకింత కంగారైతే ఎలాగండి

మాలతి:—అంతేనండి చిటికలేస్తాడు.

ప్రిన్సిపాలు.— ఏమోయ్. చిటికలు వేస్తా వట ఎందుకు? ఈ కాలేజీలో చదవాలని లేదా! చెప్పు పోనీ నీ ప్రవర్తన ఒప్పుకొనే కాలేజీ ఏదైనా వుంటే అక్కడకు వెడుదూగాని.

శాస్త్రి.—బాగా చెప్పేరు బాబూ!

బంట్రోతు — ఎన్నిమాట్లూ చెప్పినా ఊత పదం వదిలేవుగావు

అబ్బాయి.—లేదండీ సాయంకాలం కాలేజీ విడిచిపెట్టిన తర్వాత బద్ధకంగావుంటే ఆవులింత వచ్చి చిటుకలు వేస్తూంటాను. అదినాకు మొద ట్నుంచీ అలవాటై పోయిందండి. పోనీ అడ గండి చిటకలు ఎంతకాలంనుంచి వేస్తున్నానో?

మాలతి తండ్రివైపు వెఱ్ఱిమొగమేసుకొని చూసింది. శాస్త్రి అంటే అవులింతల చిటికలా అన్నట్లు మాలతి తండ్రి వేపు చూసాడు

ప్రిన్సిపాలు:— ఏం మాలతీ! ఎంతకాలం నుంచి చిటికలు వేస్తున్నాడు?

మాలతి.—[నిజం అందుకే చిటికలు వెయ్యడమే గాని మొగంపైకెత్తి ఎప్పుడూ చూడలేదు. ఇలాంటివాడిమీదా అభియోగం తెస్తే ఏమౌతుంది] కాలేజీలో జేరినప్పటినుంచీనండి, అంది తలదించుకొని.

ఇందులో ఏంలేదు మాలతి అపార్థం చేసుకొంది అని తీర్పు చెప్పారు ప్రిన్సిపాలు. శాస్త్రి జంజం నలుపుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు, ఆ వెనకాల మాలతి, తండ్రి నిష్క్రమించారు. ఇలాంటి వింతా పట్టుకరండి బాబూ యిక్కడ కాలీగావుందిఅన్నాడు బంట్రోతు- వెళ్ళిపోతూంటే శాస్త్రి కోపంగా బంట్రోతు వంక చూచి గబగబా నడకసాగించాడు అబ్బాయి తొణికిసలాడకుండా క్లాసులోకి వెళ్ళిపోయాడు- క్లాసులో పాఠం జరుగుతున్నా "జడ్జిమెంటు" పాకిపోయింది.

ఎంత తప్పుపనో అనికుంది మాలతి- అవును నిజమే ఆడపిల్ల ముందు నడుస్తూంటే ఎంత అవులింత వస్తేమాత్రం చిటికలు వెయ్యడం ఏమిటి? అనుకున్నాడు అబ్బాయి, కాలేజీలో బుర్రెత్తుకొని తిరగలేక చదువుకు స్వస్తి చెప్పింది మాలతి-

# విషజ్వాల

సజగ్నాధ్

ఈ గుడిసెలో మూగజీవాలు
మూల్గుతున్నాయ్
ఈ బుగ్గిలో మా ఆశలు
వల్లకాటి నక్షత్రాలైనై
ఈ కాటకంలో మా ప్రేమలు
బూటకాలవుతున్నాయ్
ఇక్కడే మా తాత ముత్తాతలు
మృత్యుదేవత పాల్పడ్డారు
ఇక్కడే మామా పిల్లలు
వానపాములయ్యారు
పోతపోసిన ఎముకలం మేం
గీతగీసిన పావులం
కాలచక్రం తిరిగినా
భూమితెరవు యివ్వదు
ఎన్నిపంటలు పండినా
రాతిచప్పుడు మానదు
కీటకాది క్రిములంమేం
విషః పూరితాణువులం
మన్నులో జీర్ణిస్తాం
విషజ్వాల లేపిస్తాం.

★

"సిగరెట్ కాల్చడం మానెయ్యడం చాలా తేలిక."

"స్వానుభవంమీద చెప్తున్నారా?"

"ఔను, ఆధమం వెయ్యిసార్లయినా నేను కాల్చడం మానేశాను."